ఆర్టీసీ ప్రాంగణం.. ఆటోలే అధికం..!

మానుకోట ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం ప్రైవేటు వాహనాలకు నిలయంగా మారింది. ప్రైవేటు వాహనాలు ప్రవేశించవద్దని నిబంధనలున్నప్పటికీ ప్రయాణ ప్రాంగణంలోనే ఆటోలు తిరుగుతున్నాయి.



బస్సులకు, ప్రయాణికులకు అడ్డుగా వెళ్తుండడంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. మంగళవారం సాయంత్రం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలోనే ఆటోలు అడ్డదిడ్డంగా నడిపారు.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్ టౌన్

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

కేసముద్రం, న్యూస్‌టుడే: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వోమ సంతోష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నలుపు రంగు బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సంఘం నాయకులున్నారు.

ఆ రహదారిలో.. నెలకో ప్రమాదం



ద్విచక్రవాహనం ఢీకొట్టి పొదల్లోకి దూసుకెళ్లిన కారు

- పది నెలల్లో పది మంది మృత్యువాత

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే:



జమాండ్లపల్లి-కంబాలపల్లి మధ్య జాతీయ రహదారి

జిల్లాలో ఓ ప్రధాన జాతీయ రహదారి. అందులోనూ ఓ ముఖ్య మార్గంతో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు జరిగిన ప్రమాద సంఘటనల్లో అతివేగం, నిర్లక్ష్యం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. కిలోమీటరు దూరంలో పది నెలల కాలంలో జరిగిన ప్రమాదాల్లో పది మంది మరణించారు. తాజాగా జరిగిన ఘటనలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు దుర్మరణం చెందడం అందర్ని కలవరపరుస్తోంది. ప్రమాదాల్లో మృతి చెందిన వారు ఎక్కువ గూడూరు మండలానికి చెందిన వారే ఉన్నారు.

మహబూబాబాద్-నర్సంపేట నెంబర్ 365 జాతీయ రహదారిలో జమాండ్లపల్లి-కంబాలపల్లి మధ్య మార్గంలోని కిలోమీటరు దూరంలోని రహదారిపై వాహన ప్రమాదాలు తరుచుగా జరుగుతున్నాయి. ప్రధానంగా రెండు, మూడు ప్రదేశాల్లోనే జరగడం గమనించాల్సిన విషయం. జమాండ్లపల్లి మూలమలుపు నుంచి కంబాలపల్లి గ్రామ శివారు వరకు కిలోమీటరు రహదారిలో ద్విచక్రవాహనాల నుంచి మొదలు కార్ల వరకు విపరీతమైన వేగంతో నడిపిస్తున్నారు. దీనికితోడు కొందరు మద్యం మత్తులో ఉండి వాహనాలు నడిపిస్తున్నట్లు, ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో మత్తులో ఉన్నప్పుడు జరిగిన సంఘటనలే అధికమని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం ఈ మార్గంలోనే అర్బన్ పార్కు వద్ద ద్విచక్రవాహనాన్ని అతి వేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్కడికక్కడే మరణించారు. మహబూబాబాద్ వైపు నుంచి వస్తున్న కారు రహదారి నిబంధనలు పాటించకుండా వేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం వాటిల్లిందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో కారుతో పాటు ద్విచక్రవాహనం కూడా ఆనవాళ్లు పట్టనంతగా మారింది.

గత సంఘటనలు

- డిసెంబర్ 31న మహబూబాబాద్ శివారు ఏటిగడ్డతండా సమీపంలో వేంగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఇద్దరు యువకులు మృతి చెందారు
- జనవరి 2న ఇదే మార్గంలోని ముత్యాలమ్మగూడెం క్రాస్ రోడ్డు సమీపంలో బాలుడిని కారు ఢీకొని మృతి చెందాడు
- జనవరి 15 రాత్రి సమయంలో కారు అతివేగంగా ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గూడూరు మండలం చిన్న ఎల్లాపుర్ శివారులోని ఆము తండాలోని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందారు. వీరిల్లో ఇద్దరు చిన్న పిల్లలున్నారు.

ఇవి పాటిస్తే మేలు

☛ ప్రమాద సూచిక బోర్డులను నెలకొల్పాలి. ☛ ప్రమాదాల జోన్‌గా పరిగణిస్తూ రేఖ నియంత్రికలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ☛ ఈ మార్గంలో పోలీసులు తరుచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలి.

చర్యలుంటాయా.. మామూలేనా!

- సీఎంఆర్ బియ్యం బుక్కి రూ.కోట్లు గడించిన మిల్లర్లు



గత నెల 20న బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

ఈనాడు, మహబూబాబాద్

ఉమ్మడి వరంగల్‌లోని కొంత మంది రైస్ మిల్లర్లు తమకు కేటాయించిన ధాన్యాన్ని మిల్లాడించి సకాలంలో బియ్యం అప్పగించకుండా పక్కదారి పట్టించి సొమ్ము చేసుకున్నారు. వీరిలో మూడు, నాలుగు సీజన్లకు సంబంధించి బియ్యాన్ని ఇవ్వని వారున్నారు. వీరికి పలుమార్లు గడువు ఇచ్చినా ఫలితం లేకపోయింది. క్షేత్రస్థాయిలో ధాన్యం నిల్వలను పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో బకాయిపడ్డ మిల్లర్లు కొందరు ధాన్యాన్ని అడ్డదారిలో అధిక ధరలకు విక్రయించి రూ.కోట్లు గడించారు. వీరిపై ఈసారైనా చర్యలు తీసుకుంటారా లేదా ఎప్పటిలాగే 'మామూలు'గా వదిలేస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది.

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎల్లంపేటకు చెందిన శ్రీ లక్ష్మి పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 యాసంగి సీజన్‌లో పౌరసరఫరాల శాఖ 62579.80 క్వింటాళ్ల ధాన్యం కేటాయించింది. మిల్లరు సీఎంఆర్ కింద ధాన్యం మరాడించి 42553.58 క్వింటాళ్ల బియ్యం అందజేయాల్సి ఉండగా 24,336 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చి మిగతాది బకాయిపడ్డారు. అందుకు సంబంధించిన రూ.6.49 కోట్ల విలువైన 26,790 క్వింటాళ్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం గత నెల 20న మిల్లులో చేపట్టిన దాడుల్లో గుర్తించింది. ఈ మిల్లు జిల్లాలో పేరున్న ఒక మాజీ ప్రజాప్రతినిధిది. గతేడాది వానాకాలం సీజన్‌లో ధాన్యం కేటాయింపు నిలిపివేయగా అధికారులపై ఒత్తిడి తెచ్చి ధాన్యం కేటాయింపులు చేయించుకున్నారు.

- మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచెర్ల శివారులోని నవ్య పారాబాయిల్డ్ రైస్ మిల్లుకు 2022-23 సీజన్‌లో పౌరసరఫరాలశాఖ 53,560 క్వింటాళ్ల ధాన్యాన్ని కేటాయించింది. మిల్లర్లు సీఎంఆర్ కింద 36,240 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా 8,871 క్వింటాళ్లు మాత్రమే ఇచ్చారు. ఇంకా 27,549 క్వింటాళ్ల బియ్యం ఇవ్వాలి. మిగతా 40,513 క్వింటాళ్ల ధాన్యంలో కేవలం 6,238 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే నిల్వ ఉన్నట్లు గుర్తించారు. దాంతో మిల్లరు ప్రభుత్వానికి రూ.8.36 కోట్లు నష్టపరిచినట్లు గత నెల 21న మిల్లులో తనిఖీ చేసిన రాష్ట్ర పౌరసరఫరాల టాస్క్‌ఫోర్స్ బృందం పేర్కొంది.

టాస్క్‌ఫోర్స్

ఇలా జరగాలి..

మిల్లులకు ధాన్యం కేటాయించిన తర్వాత అక్కడ లెక్క ప్రకారం నిల్వలున్నాయా.. లేవా, మిల్లాడిస్తున్నారా.. లేదా అనేది క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు జిల్లాల వారీగా పౌరసరఫరాలశాఖ వద్ద సరిపడా సిబ్బంది లేదు. దాంతో పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా స్థాయిలో రెవెన్యూ అదనపు కలెక్టర్లు, మండల స్థాయిలో డిప్యూటీ తహసీల్దార్లకు అప్పగించారు. వారు మిల్లులను పరిశీలించి బియ్యం నిల్వల నివేదికలను రాష్ట్ర అధికారులకు అందించాలి. తేడా ఉన్న మిల్లులకు మరో సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపు నిలిపివేస్తారు.

ఇదీ జరుగుతోంది..

మిల్లర్ల అక్రమాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వకపోవడం వల్లనే ఒక సీజన్‌ది కాస్త నాలుగు సీజన్లకు పెరిగింది. ఇందుకు అధికారులు మిల్లర్ల నుంచి రూ.లక్షల్లో ఆమ్యామ్యాలను పుచ్చుకుంటూ ధాన్యం కేటాయింపులకు సహకరించారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని మిల్లలకు సామర్థ్యానికి మించి ధాన్యాన్ని కేటాయించారు. అప్పుడు కూడా అధికారుల అండదండలతో పక్కదారి పట్టించారు.

ఇదీ పరిస్థితి..

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా 94 మంది రైస్ మిల్లర్లు బియ్యం అప్పగించలేదు. ● వీరిలో రెండు, అంతకంటే ఎక్కువ సీజన్లు బకాయి ఉన్న వారికి ప్రస్తుత సీజన్ నుంచి ధాన్యం కేటాయింపు నిలిపివేయాలనేది పౌరసరఫరాలశాఖ నిర్ణయించింది. మిల్లర్లు కొందరు ధాన్యం కేటాయింపుల కోసం గతంలో మాదిరిగానే అధికారులను మచ్చిక చేసుకోవడానికి మంతనాలు చేస్తున్నట్లు తెలిసింది.

బియ్యం బకాయిపడ్డ మిల్లర్లు (సీజన్లవారీగా)

జిల్లా	ఒకటి	రెండు	మూడు	నాలుగు	మొత్తం
హనుమకొండ	19	3	1	1	24
జనగామ	9				9
భూపాలపల్లి	9				9
వరంగల్	24	5			29
మహబూబాబాద్	16	5			21
ములుగు	5	1			6

అద్దె భవనానికి మరమ్మతులు.. ఆరుబయటే విధులు!

డోర్నకల్, న్యూస్‌టుడే: అధికారుల అలసత్వం, ప్రజాప్రతినిధుల బాధ్యతారాహిత్యంతో వైద్య సిబ్బంది ఆరు బయట విధులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. డోర్నకల్-1లోని ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్ర భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఇద్దరు ఏఎన్ఎంలు, ఆరుగురు ఆశా కార్యకర్తలు పని చేస్తున్నారు. వీరు తమ పరిధిలోని రోగులకు సేవలు అందిస్తూ ఇల్లిల్లు తిరిగి ఆరోగ్య వివరాలను తెలుసుకొని మందులు ఇస్తున్నారు. ఆ వివరాలు ప్రత్యేక రిజిస్టరులో నమోదు చేయాల్సి ఉంటుంది. అద్దె ఇంటికి మరమ్మతు తలపెట్టడంతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్వహణ కష్టంగా మారింది. సమీపంలోని గ్రంథాలయం ప్రహరీ లోపల కూర్చుని విధులు నిర్వహించారు. ఆరోగ్య ఉప కేంద్ర సొంత భవనం నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు కాగా 2023 ఆగస్టు 23న శంకుస్థాపన జరిగింది. ప్రభుత్వం మారడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇప్పట్లో ఇది పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు. మంగళవారం పర్యటనకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్‌వత్సల్‌టొప్పో దృష్టికి ఆశాకార్యకర్తలు తమ దీనావస్థని వివరించారు. సొంత భవనం కట్టడం పూర్తయ్యేలా చొరవ చూపమని వేడుకున్నారు.



మరమ్మతులో అద్దె భవనం



ఆరు బయట కూర్చుని విధులు నిర్వహిస్తున్న ఆశాకార్యకర్తలు

బరువు.. బాధ్యత..!

సంచార జీవి.. రోజుకో ఊరు తిరిగితేగాని పూట గడవదు.. ప్లాస్టిక్ సామగ్రి విక్రయిస్తూ జీవనం గడుపుతున్నారు.. ఇటీవల మహారాష్ట్రలోని చంద్రాపూర్‌నుంచి ఆమె కుటుంబం సహా డోర్నకల్‌కు వచ్చారు.. ఉదయాన్నే నెత్తిపై ప్లాస్టిక్ కుర్చీలు పెట్టుకొని చంకలో బిడ్డతో డోర్నకల్ పుర వీధుల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారు. కుటుంబ పోషణకు బరువు మోస్తున్న ఆమె.. అమ్మగా తన బాధ్యతను మరవలేదు. డోర్నకల్‌లోని వీధుల్లో మంగళవారం కనిపించిన ఈ చిత్రాన్ని 'న్యూస్‌టుడే' తన కెమెరాలో బంధించింది. – న్యూస్‌టుడే, డోర్నకల్





పోలీసు అమరులకు నివాళి

నెహ్రూసెంటర్, దంతాలపల్లి, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరులు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి జిల్లా కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం నుంచి నెహ్రూసెంటర్ మీదుగా కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలను విస్మరించొద్దన్నారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి రావు, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ ఎస్సైలు., సిబ్బంది, విద్యార్థులు స్థానికులున్నారు. దంతాలపల్లిలోని అంబేడ్కర్ కూడలిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.



దంతాలపల్లిలో..

ప్రగతి పనులకు కార్యాచరణ

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ పురలో అంతర్గత రహదారులు, కాలువల నిర్మాణంపై జిల్లా పాలనాధికారి అద్వైత్ కుమార్ సింగ్ అధ్యయనం జరిపారు. మంగళవారం ఆయన మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, డీఈఈ నవీన్, తదితర అధికారులతో పర్యటించారు. ప్రతిపాదిత పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ లిమిటెడ్ (టీయూఎఫ్ఐడీసీ) మంజూరైనా రూ.10 కోట్లతో డోర్నకల్‌లో హెచ్‌పీ పెట్రోల్ బంకు నుంచి సెయింటు ఆగ్నెస్ పాఠశాల వరకు రోడ్డుతో పాటు కాలువ, సెయింటు ఆగ్నెస్ పాఠశాల నుంచి ముత్యాలమ్మ గుడి వరకు రోడ్డుతో పాటు కాలువ, ఎస్‌బీఐ నుంచి బ్రిలియంటు స్కూల్ వైపునకు కాలువ, మండల పరిషత్ కార్యాలయం వద్ద కల్వర్టు, సుభాష్ వీధిలో రైల్వే కాలువకు అనుసంధానం చేస్తూ పురపాలిక కాలువ నిర్మించాలని సంకల్పించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. డోర్నకల్ వచ్చిన కలెక్టర్‌ను కౌన్సిలర్ కొండేటి హేమచంద్రశేఖర్ కలిసి బ్రహ్మణ కుంట పూడ్చివేత పనులపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో పుర కమిషనర్ నరేష్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ వీరన్న, ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఛైర్మన్ కోటిలింగం, డీఈఈ నవీన్, ఆర్ఐ యాసీన్, మేనేజర్ నాగరాజు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్, కిషోర్ పాల్గొన్నారు.



కాలువ పనుల మార్గాన్ని పరిశీలిస్తున్న అద్వైత్ కుమార్ సింగ్

వరద కాలువల నిర్మాణానికి ప్రతిపాదన

మరిపెడ, న్యూస్‌టుడే: మరిపెడ పట్టణంలో రూ.10 కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో పురపాలక సంఘం చేపట్టే అభివృద్ధి పనులను పాలనాధికారి మంగళవారం పర్యవేక్షించారు. 2023 సెప్టెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం మరిపెడ పురపాలికలో రూ.10 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అనుమతి మంజూరి చేసిందని, పురపాలిక కమిషనర్ వెంకటస్వామి నేతృత్వంలోని ప్రజారోగ్య విభాగం ఇంజినీరింగ్ అధికారులు చేపట్టాల్సిన పనులపై కసరత్తు చేసి రూ.2 కోట్లతో కార్గిల్ కూడలి నుంచి పబ్లిక్ పార్కు వరకు జాతీయ రహదారికి ఇరువైపులా వరద కాలువలు నిర్మాణం, రూ.2 కోట్లతో మాకుల చెరువు వద్ద ట్యాంక్ బండ్ నిర్మాణం, రూ.1.5 కోట్లతో మరిపెడ పట్టణంలో జాతీయ రహదారిపై విభాగిణి అభివృద్ధితో పాటు రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. తహసీల్దార్ సైదులు, ప్రజారోగ్య విభాగం డీఈఈ నవీన్, ఏఈ దివ్య, ప్రజారోగ్య విభాగం అధికారులు పాల్గొన్నారు.

చిన్న దేవాలయాల అభివృద్ధిపై చిన్నచూపు!

- ట్రస్టీల ఏర్పాటునూ పట్టించుకోని ప్రభుత్వం

మహబూబాబాద్, న్యూస్‌టుడే

దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలో ఉన్న చిన్న దేవాలయాల ట్రస్టుబోర్డు నియామకాలపై స్థానిక ప్రజాప్రతినిధులు చిన్నచూపు చూస్తున్నారు. దీంతో వివిధ విభాగాల్లో గుర్తింపు కలిగిన ఈ చిన్న ఆలయాల నిర్వహణ, ఆలనాపాలన చూసే నాథులు కరవయ్యారు. ఆ దేవాలయాల అభివృద్ధి, భక్తులకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీప, ధూప నైవేద్యాలకు కూడా ప్రభుత్వ గుర్తింపు పొందినా జిల్లాలో ఇప్పటివరకు పాలకవర్గాల నియామకం జరగని కొన్ని ఆలయాలున్నాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా పాలకవర్గాల నియామకంపై ఊసెత్తడం లేదు. జిల్లా కేంద్రంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయం, రామాలయానికి పాలకవర్గం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. ఈమేరకు ప్రకటన జారీ చేసినా అవి ప్రచారంలోకి రాకపోవడంతో ఎవరూ దృష్టి సారించడం లేదు.

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పెద్ద ఆలయాల ట్రస్ట్ బోర్డు ఏర్పాటుపై పోటీ తీవ్రంగా ఉంటుంది. జిల్లాలో దేవాలయ ట్రస్ట్ బోర్డు నియామకానికి 8 ఆలయాలు అర్హత కలిగి ఉన్నాయి. ఆయా ఆలయాల ఆదాయ, వనరుల మేరకు వాటిని వివిధ కేటగిరీలుగా విభజించారు. ముఖ్యంగా కురవి శ్రీ వీరభద్రస్వామి ఆలయం, గుంజేడు ముసలమ్మ, నర్సింహులపేట స్వయంభూ వేంకటేశ్వర స్వామి ఆలయ పాలకవర్గాలకు తీవ్రమైన పోటీ ఉంటుంది.

పాలకవర్గాల్లో సభ్యులు ఇలా..

ప్రతి ఆలయ పాలక మండలిలో నిబంధనల మేరకు మహిళ, ఎస్సీ, ఎస్టీలకు సభ్యుడికి విధిగా అవకాశం కల్పించాలి. ఆలయ అర్చకులు, అధికారులు ఎక్స్‌అఫిషియో మెంబర్‌గా ఉంటారు. 6ఏ విభాగం పాలకమండలిలో 14 మంది సభ్యులను నియమించాల్సి ఉంటుంది. 6బి విభాగంలో ఏడుగురు, 6సి కేటగిరీలో ఐదుగురు సభ్యులుంటారు. పాలకమండలి ఏర్పాటు చేస్తే ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం, దాతల నుంచి నిధులను సమీకరించే అవకాశం ఉంటుంది. సంబంధిత ఆలయాల్లో ఉత్సవాల నిర్వహణలకు పాలకవర్గం పర్యవేక్షణ చేస్తుంది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం అయినా చిన్న ఆలయాల పాలకవర్గాల నియామకాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

- దేవాదాయ, ధర్మాదాయ శాఖ చట్టంలో సూచించిన నిబంధనల మేరకు ఆయా దేవాలయ ట్రస్ట్ బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత 'న్యూస్‌టుడే'కు చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రకటనలు జారీ చేసి నిర్దేశించిన గడువులోగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.



మహబూబాబాద్‌లోని శ్రీరామ మందిరం

జిల్లాలో ఆలయాలు ఇలా

6ఏ: భద్రకాళిసమేత వీరభద్రస్వామి ఆలయం, కురవి. ముసలమ్మ ఆలయం, గుంజేడు.

6బి: ఉమా చంద్రమౌళీశ్వర స్వామి ఆలయం, మహబూబాబాద్, రామాలయం(రామమందిరం) మహబూబాబాద్.

వేంకటేశ్వరస్వామి ఆలయం, నర్సింహులపేట, మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయం, మరిపెడ.

6సి: పార్వతీరామలింగేశ్వరస్వామి ఆలయం, మహబూబాబాద్. వేటవేంకటేశ్వరస్వామి ఆలయం, మర్రిగూడెం(గార్ల)

ముగ్గురు ఏఈవోల సస్పెన్షన్

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: రైతు బీమా పథకం మార్గదర్శకాలకు అనుగుణంగా రైతుల మరణాలను నమోదు చేయడంలో నిర్లక్ష్యం చూపారనే కారణంతో జిల్లాలోని ముగ్గురు వ్యవసాయ విస్తరణ అధికారులను(ఏఈవో) సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో బయ్యారం మండలంలోని రామచంద్రాపురం క్లస్టర్ ఏఈవో పూల అఖిల్‌కుమార్, పెద్దవంగర మండలం వడ్డెకొత్తపల్లి క్లస్టర్ ఏఈవో యశశ్విని, గార్ల క్లస్టర్ ఏఈవో ఎ.కిరణ్ ఉన్నారు.

మూడు వైపులా.. కష్టాలే!

నిత్యం వేలాది ప్రైవేటు వాహనాలు, కార్ల రాకపోకలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనాలు ఇవన్నీ హనుమకొండ బస్టాండు ప్రాంతంలో కనిపించే ట్రాఫిక్ కష్టాలు. నగరవాసులు ఆ మార్గంలో వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఉమ్మడి వరంగల్‌కు కీలకమైన హనుమకొండ ప్రధాన బస్టాండులో ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రత్యామ్నాయ మార్గాలపై 'న్యూస్‌టుడే' పరిశీలన కథనం..

–హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే

- పద్మవ్యూహంలో హనుమకొండ బస్టాండ్
- ఛేదించడానికి ఉన్నాయి మార్గాలు

పరిశీలన



1 ఇది కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి.. బస్టాండ్‌లోని బస్సులన్నీ దీని ద్వారానే బయటకు వెళ్లాలి



ఎవరికి నచ్చినట్టు వారు..



ఆటోలు, ఫుట్‌పాత్‌లపై వాహనాలు

బస్టాండు లోపలికి వెళ్లే రెండు దారులు గందరగోళంగా ఉంటాయి. ఆటోవాలాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుంటారు. కొందరు ఆటో డ్రైవర్లు బస్టాండు నుంచి వచ్చే ప్రయాణికులను ఎక్కించుకునేందుకు అక్కడే చక్కర్లు కొడుతూ ట్రాఫిక్ సమస్యలు తెస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌లకు వచ్చే వారి వాహనాలతో రోడ్డు మొత్తం బ్లాక్ అవుతోంది.

కట్టడి చేయడం కీలకం

☛ ఆటోవాలాలు క్రమ పద్ధతిలో ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలి. ☛ బస్టాండు రోడ్డుకు రెండు వైపులా ప్రైవేటు ఆసుపత్రుల వారు ఆక్రమించుకున్న ఫుట్‌పాత్‌లను ఖాళీ చేయించాలి. పాదచారులు నడిచేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలి.

సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- నార్లగిరి రమేష్, ప్రయాణికుడు, హనుమకొండ



బస్టాండు రోడ్డు నుంచి మచిలీబజార్, పద్మాక్షిరోడ్డుకు వెళ్లాలంటే కనీసం అరగంట సమయం పడుతోంది. ఆటోలు, ద్విచక్రవాహనాలు ఇష్టారీతిగా పార్కింగ్ చేసి ఉంటాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నడుస్తున్నాయి. ట్రాఫిక్ పోలీసులతో పాటు, నగపాలక సంస్థ, ఆర్టీసీ అధికారులు సమన్వయంతో కృషి చేసి ఈ సమస్యకు పరిష్కారం చూపాలి.

ప్రైవేటు వాహనాలను అడ్డుకుంటున్నాం..

- విజయభాను, ఆర్టీసీ వరంగల్ రీజియన్ మేనేజర్



బస్టాండులోకి ప్రైవేటు వాహనాల రాకకు పూర్తిగా అడ్డుకట్ట వేశాం. కాజీపేట, ములుగు రోడ్డు, పెట్రోల్‌పంపుల నుంచి కొన్ని బస్సులను నేరుగా పంపించేందుకు అక్కడ అనువైన స్థలం లేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యేతో చర్చిస్తున్నాం.



2 ఇది కీలకమైన జంక్షన్ దారి.. దీన్ని మూసివేయడంలో ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది.

మూడు మార్గాలు ఉన్నా..

బస్టాండు లోకి వెళ్లడానికి మూడు దారులున్నాయి. కేడీసీ రోడ్డుకు వెళ్లే దారి, బస్టాండు జంక్షన్ పక్కన ఒకటి, మసీదు పక్కన మరొకటి. అన్ని మార్గాల గుండా వచ్చే బస్సులు మసీదు పక్కన ఉన్న గేటు నుంచే బస్టాండ్‌లోనికి అనుమతి ఇస్తున్నారు. వందలాది బస్సులు ఇదే మార్గంలో లోపలికి రావడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. మరోవైపు బస్సులన్నీ కేడీసీ దారిలో ఉన్న గేటు గుండా బయటకు వెళ్తుంటాయి.. కీలకమైన బస్టాండ్ జంక్షన్ దారిని ప్రమాదాలు జరుగుతున్నాయని మూసివేశారు.

ఇలా చేద్దాం

☛ గతంలో మాదిరిగానే బస్సులు లోపలికి వచ్చే మార్గాలు రెండు ఉండాలి.

☛ ఏటూరునాగారం, ములుగు, ఖమ్మం, మహబూబాబాద్, నర్సంపేట రూట్లలో వచ్చే బస్సులు హనుమకొండ చౌరస్తా మీదుగా మసీదు పక్క ఉన్న దారి గుండా లోపలికి వెళ్లాలి.

☛ హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జనగామ నుంచి వచ్చే బస్సులు జంక్షన్ వద్ద ఉన్న మార్గం ద్వారా లోపలికి వెళ్లే ఏర్పాటు చేయాలి.

☛ ప్రమాదాలు జరగకుండా సెక్యూరిటీ సిబ్బందితో పాటు ఇద్దరు ట్రాఫిక్ పోలీసులను ఉంచాలి. ప్రైవేటు వాహనాలు లోపలికి రాకుండా కట్టడి చేయగలిగితే ప్రమాదాలు జరగవు.



3 ఇది మసీదు పక్క నుంచి బస్టాండ్‌లోకి వెళ్లే దారి.. బస్సులన్నీ ఇక్కడి నుంచే లోపలికి వెళ్లాలి..

వరంగల్ రీజియన్‌లోని ఆర్టీసీ డిపోలు	9	మొత్తం బస్సులు	908	నిత్యం హనుమకొండ బస్టాండుకు వచ్చే ప్రయాణికుల సంఖ్య	60 వేలు	ఉమ్మడి ఆరు జిల్లాల నుంచి వచ్చే బస్సులు	1200	ప్రయాణించే మార్గాలు	374



ములుగు రోడ్డు బస్టాండు

ఇదీ పరిస్థితి

హనుమకొండ బస్టాండు ఇరుకుగా ఉంటుంది. పక్కపక్కనే ప్లాట్‌ఫారాలు ఉండటంతో బస్సులు లోపలికి వచ్చి బయటకు వెళ్లాలంటే గంటల కొద్ది సమయం వృథా అవుతోంది. ప్రయాణికులూ తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

☛ హైదరాబాద్ తరహాలో బస్ పాయింట్లు ఏర్పాటు చేయాలి. హైదరాబాద్ నగరంలో ఎంజీబీఎస్ ప్రధాన బస్ స్టేషన్ ఉన్నప్పటికీ కరీంనగర్ వైపు వెళ్లే బస్సులు ఎక్కువ సంఖ్యలో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి నడుస్తాయి. వరంగల్ వెళ్లే బస్సులు ఉప్పల్ నుంచి నడుస్తాయి. అదే తరహాలో ఇక్కడ కరీంనగర్, ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ప్రత్యేక బస్‌స్టేషన్ నుంచి పంపిస్తే ఇబ్బందులు తీరుతాయి.

☛ హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో 20 శాతం బస్సులను హనుమకొండ బస్టాండు నుంచి కాకుండా కాజీపేట బస్టాండు నుంచి పంపిస్తే సగం ప్రయాణికులకు సమయం ఆదాతో పాటు ఆర్టీసీకి డీజిల్ ఆదా అవుతుంది. ట్రాఫిక్ సమస్యలు ఉండవు.

పరిష్కారం

☛ ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ వెళ్లే వాహనాలు నేరుగా ములుగు రోడ్డు నుంచి వెళ్లేలా చూడాలి.

☛ కరీంనగర్, నిజామాబాద్ బస్సుల్లో కొన్నింటిని హనుమకొండ పెట్రోల్ పంపు నుంచి నేరుగా పంపించొచ్చు.

☛ రిజర్వేషన్ బస్సులను సైతం మరో చోటు నుంచి పంపించే ఏర్పాటు చేస్తే సమస్య కొంత వరకు పరిష్కారం అవుతుంది.



కాజీపేట బస్టాండు



విలేకరుల సమావేశంలో కథానాయిక అనన్య, హీరో యువ చంద్రకృష్ణ

'పొట్టేల్' సినిమా బృందం సందడి


కాశీబుగ్గ, న్యూస్‌టుడే: నగరంలో 'పొట్టేల్' సినిమా బృందం సందడి చేసింది. ఆకట్టుకునే కథ, మెప్పించే కథనంతో ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న 'పొట్టేల్' సినిమాను ఆదరించాలని కథానాయకుడు యువ చంద్రకృష్ణ, కథానాయిక అనన్య ప్రేక్షకులను కోరారు. మంగళవారం వరంగల్ వెంకట్రామా థియేటర్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వరంగల్‌కు చెందిన నిషాంత్ రెడ్డి, సురేశ్ చిత్రాన్ని నిర్మించారని, పక్కా పల్లె వాతావరణం, చిన్నపాప చదువు కోసం మేం పడిన కష్టం ఈ సినిమాలో కనిపిస్తుందని చిత్ర బృందం తెలిపింది. గురువారం సినిమా విడుదలవుతోందని, ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లో ప్రచారం చేశామని, తెలంగాణలో వరంగల్ నుంచే మొదలు పెడుతున్నామని వివరించారు. ఓటీటీలో కాకుండా సినిమాను థియేటర్ లోనే చూడాలని అభ్యర్థించారు. అంతకు ముందు హీరో యువ చంద్రకృష్ణ తీన్మార్ డాన్స్ చేశారు. సమావేశం అనంతరం సినిమా పోస్టర్లను ఆవిష్కరించారు. కథానాయిక అనన్యతో స్వీయచిత్రం దిగడానికి అభిమానులు పోటీపడ్డారు.

అథ్లెటిక్స్ పోటీలు వాయిదా

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 25న నిర్వహించాల్సిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు వాయిదా వేస్తున్నట్లు హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి సంస్థ అధికారి, అండర్-19 ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఇతర క్రీడాంశాలు షెడ్యూల్ ప్రకారమే ఉంటాయన్నారు.

చికెన్ ధరలు వెన్‌కాబ్ (కిలో వెల రూపాయలలో)			
ఫాంరేటు:	125	డ్రెస్డ్:	213
రిటైల్:	147	స్కిన్‌లెస్:	243

ప్రధాని మోదీ ప్రత్యుత్తరం.. మురిసిన విద్యార్థులు



प्रधान मंत्री
Prime Minister

New Delhi
01 October, 2024

Shri Nagchetanya Ji,

Heartfelt gratitude to you for sending warm birthday wishes. I am overwhelmed to receive greetings from my family members such as yourself from across the country.

Your trust, support and cooperation are my real treasure. Your affectionate words fill me with new energy to strive in service of the nation. In the third term of our government, my resolve to fulfil the aspirations of the people and take India to great heights of progress has further strengthened.

Powered by the ability of our people and the skills of our youth, we have been setting new benchmarks in development over the last 10 years. Amrit Kaal is an opportunity to scale up our efforts to build a developed, inclusive and self-reliant nation.

The contribution of every Indian towards the progress of the nation is deeply valued.

With best wishes for your good health, happiness and prosperity.

Yours,

(Narendra Modi)

గుండెంగ యూపీయస్ విద్యార్థులకు ప్రధాని రాసిన ప్రత్యుత్తరం

దేవరుప్పుల (జనగామ జిల్లా), మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగ ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7వ తరగతుల విద్యార్థులు వారంతా.. పాఠశాల ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత కొడిపాక రమేశ్ ప్రోత్సాహంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సెప్టెంబర్ 17ను పురస్కరించుకొని జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ హిందీలో లేఖలు రాసి పోస్టు చేశారు. సోమవారం ప్రధాని కార్యాలయం నుంచి 'ధన్యవాదాలు' అంటూ ప్రత్యుత్తరం అందింది. దీంతో ఆ పల్లె వాసులు, విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు కిషన్, చీకటి శ్రీను, కందిక దామోదర్, ప్రధానోపాధ్యాయుడు రాజు సమక్షంలో వాటిని విద్యార్థులకు అందించడటంతో పండగ వాతావరణం నెలకొంది.



ప్రధాని రాసిన లేఖలతో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

భద్రపరుచుకుంటాం..



- మణిహర్షిత, ఏడో తరగతి

గత నెలలో పోస్టుకార్డుతో ప్రధాని పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ మాస్టారు లేఖ రాయమంటే రాసి మరిచిపోయాం. ప్రస్తుతం తిరిగి లేఖ రావడంతో విద్యార్థులం అంతా చాలా ఆనందపడ్డాం. ఆంగ్లంలో వచ్చిన లేఖను ఉపాధ్యాయులు చదివి తెలుగులో వివరించారు. దేశ ప్రధాని నుంచి వచ్చిన ప్రత్యుత్తరం ఫ్రేమ్ కట్టించి ఇంట్లో భద్రపరుచుకుంటాం.

డమ్మీ పిస్టల్‌తో బెదిరింపు.. దుండగుడి అరెస్టు

దామెర, న్యూస్‌టుడే: డబ్బు కోసం డమ్మీ పిస్టల్‌తో బెదిరించిన దుండగుడిని అరెస్టు చేసినట్లు హనుమకొండ జిల్లా పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ తెలిపారు. దామెర పోలీస్ స్టేషన్‌లో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన రాయల వెంకటేశ్వర్లు 2006లో ప్రజాప్రతిఘటన పార్టీలో కొరియర్‌గా పనిచేసి, 2007లో ఖమ్మం ఎస్పీ ఎదుట లొంగిపోయాడు. తదనంతరం ఎన్ని పనులు చేసినా ఎక్కువ డబ్బు రాకపోవడంతో ఖమ్మం శివారులో పలు కిరాణా దుకాణాలకు వెళ్లి మాజీ నక్సలైట్‌నంటూ బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. డమ్మీ పిస్టల్‌తో బెదిరిస్తే మరింత డబ్బు వసూలు చేయవచ్చని భావించి హైదరాబాద్‌లో డమ్మీ తుపాకీ కొనుగోలు చేశాడు. దీంతో అతనిపై ఖమ్మం జిల్లా పరిధిలో సుమారుగా 10కి పైగా కేసులు నమోదయ్యాయి. రూ. 800తో మరో నకిలీ తుపాకీ కొనుగోలు చేశాడు. వరంగల్‌లో నక్సలైట్ల ప్రభావం ఎక్కువగా ఉంటుందనే ఆలోచనతో ఈ నెల 21న ఖమ్మం నుంచి రైలులో వరంగల్‌కు చేరుకుని అర్ధరాత్రి వేళ ఊరుగొండ వద్ద ఆటో దిగాడు. అక్కడ కిరాణం దుకాణం యజమాని కందికొండ సంపత్‌ను నిద్ర లేపి సిగరెట్ తీసుకుంటున్న క్రమంలో డమ్మీ పిస్టల్ చూపి డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. లేవని చెప్పిన సంపత్‌ను కిందపడేసి గల్లా పెట్టెలో రూ. 2000 తీసుకొని, తాను నక్సలైట్‌నని, ఎవరికైనా చెప్తే చంపేస్తానంటూ బెదిరించాడు. ఈక్రమంలో సంపత్ దుండగుడు వెంకటేశ్వర్లును గట్టిగా పట్టుకుని కేకలు వేశాడు. వెంటనే చేరుకున్న స్థానికులు అతణ్ని బంధించి డమ్మీ పిస్టల్‌ను లాక్కొని పోలీసులకు అప్పగించారు. సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడు వెంకటేశ్వర్లును కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దుండగుడు వెంకటేశ్వర్లు వెనక ఇంకా ఎవరెవరు ఉన్నారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. వీరి వెంట సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్, ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్

సీతాఫలాల విక్రయాలు.. రాకపోకలకు తిప్పలు!



జనగామ పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు వైపు యూటర్న్ వద్ద బైపాస్ రహదారిపైనే సీతాఫలాల విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు సీతాఫలాల కొనుగోళ్లకు ఆగడంతో కొంత మేర రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రహదారి పక్కగా కూర్చుంటే ఇబ్బందిగా ఉండదని విక్రయదారులుకు పోలీసులు సూచిస్తున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్


వరిసాగు అందం.. తేయాకు తోటల చందం



ఈ చిత్రం చూస్తుంటే అస్సాం రాష్ట్రంలోని తేయాకు తోటలను తలపిస్తున్నాయి కదూ. ఇది వరి విత్తనోత్పత్తి క్షేత్రం. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ శివారులో కావేరి విత్తన సంస్థ ఆధ్వర్యంలో రైతు ఆడ, మగ వరిని నాటారు. మగ వరి కోసి వేరు చేయడంతో మిగిలిన పంట తేయాకు తోటలో పాదుల్లాగ ఇలా కనిపిస్తోంది. దారిన పోయే బాటసారులు ఎంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు.

– ఈనాడు, హనుమకొండ, న్యూస్‌టుడే భీమదేవరపల్లి

హరిత గిరి.. కొలువైన శ్రీహరి



పచ్చదనంతో అలరారుతూ ఆహ్లాదకరంగా ఉన్న ఈ కొండ హనుమకొండ జిల్లా భీమారం పరిధిలోని ఎర్రగట్టు గుట్ట. దీనిపై అనేక రకాల ఔషధ మొక్కలు, మధుమేహాన్ని నియంత్రించే తిప్పతీగ, చర్మ వ్యాధులను నయం చేసేందుకు వాడే గడ్డిపూల జాతి మొక్కలు ఉన్నాయి. వీటితో నల్లనేరేడు, సీతాఫలాలు, వేప తదితర వృక్షాలు ఉన్నాయి. ఈ గుట్టపైనున్న ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువైన శ్రీహరి భక్తులకు కనులవిందుగా దర్శనమిస్తున్నారు.

– ఈనాడు హనుమకొండ, న్యూస్‌టుడే భీమారం

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు ప్రారంభం



పోటీపడుతున్న క్రీడాకారులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ చదరంగం సంఘం సహకారంతో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు మంగళవారం హనుమకొండలోని తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకల మందిరంలో ప్రారంభమయ్యాయి. వరంగల్ చదరంగం సంఘం ఆధ్వర్యంలో అండర్-15 విభాగంలో నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 100 మంది బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు ఈవీ. శ్రీనివాస్‌రావు హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఓరుగల్లు క్రీడాకారుడు, గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ స్ఫూర్తితో రాణించాలని సూచించారు. అనంతరం బాలలతో చదరంగం ఆడి ఉత్తేజపరిచారు. పోటీల నిర్వహణ కార్యదర్శి కన్నా, ఆర్బిటర్స్ సాయిప్రదీప్, శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి పాల్గొన్నారు.



పార్కు ముఖద్వారం



నెలకొన్న పచ్చదనం



ఓపెన్‌జిమ్‌లో కసరత్తు

ఆహ్లాదకరం యతిరాజారావు పార్కు

తొర్రూరు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లాలో ఏకైక రెవెన్యూ డివిజన్ కేంద్రం తొర్రూరు. సుమారు 30 వేల పైచిలుకు జనాభా కలిగిన పట్టణానికి ఇతర ప్రాంతాల నుంచి రోజు సుమారు 2-3 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దినదినాభివృద్ధి చెందుతున్న తొర్రూరులో ప్రజల సౌకర్యార్థం దివంగత నేత నెమురుగొమ్ముల యతిరాజారావు స్మారకంగా ఆయన పేరున ఏడెకరాల స్థలంలో పార్కును ఏర్పాటు చేశారు. మూడేళ్ల కింద మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రూ. 2 కోట్లు కేటాయించి, అందులో ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకోవడానికి ఆటవస్తువులు, సేద తీరడానికి ప్రత్యేక బల్లలు, హట్స్, చూడముచ్చటైన విగ్రహాలు, ప్రత్యేకంగా వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఆటవిడుపుగా నిలుస్తోంది. చుట్టూ వాకింగ్‌ట్రాక్, నర్సరీ నుంచి మొక్కలను తెప్పించి నాటడంతో పచ్చందాలను సంతరించుకుంటుంది. అలాగే ఇక్కడ విజయదశమి నాడు రావణవధ కూడా ఘనంగా నిర్వహిస్తారు. క్రీడా పోటీలు, పలు చిత్రాల షూటింగ్‌లు నిర్వహించిన దాఖలాలు ఉన్నాయి. నిత్యం 50 నుంచి 100 పిల్లలు కరాటే శిక్షణ పొందుతారు. ఇక సెలవు రోజుల్లో అయితే జనాల రాకతో కిక్కిరిసి కనిపిస్తుంది.

రేపు ఉద్యోగమేళా

మహబూబాబాద్, న్యూస్‌టుడే: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాన్ని కల్పించేందుకు కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాశాఖ కార్యాలయంలో ఈ నెల 24న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాశాఖ అధికారి టి.రజిత తెలిపారు. హైదరాబాద్‌లోని క్రెడిట్ ఆక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీలో ఇంటర్, ఐటీఐ విద్యార్హత కలిగి డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉన్న 18 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సులో ఉన్న పురుషులు, 18 నుంచి 35 ఏళ్ల వయసులో ఉన్న మహిళలు ఎంపిక చేయనున్నట్లు ఆమె తెలిపారు. వివరాలకు ఆ కంపెనీ హెచ్ఆర్ ప్రశాంత్ సెల్ నెంబర్ 8523098024ను సంప్రదించాలని కోరారు.

25న సీడీఎంఏ కార్యాలయం ముట్టడి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 25న హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ అనుబంధ పురపాలక కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపల్లి శ్రీను తెలిపారు. మంగళవారం కార్మిక సంఘం ఆధ్వర్యంలో తమ సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వడంతో పాటు 25న సీడీఎంఏ కార్యాలయం ముట్టడికి కార్మికులంతా తరలివెళ్లనున్నట్లు వివరించారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ. 26 వేలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని కోరారు. కార్మికులు చనిపోయిన వెంటనే రూ. 30 వేలు అంత్యక్రియల కార్యక్రమానికి చెల్లించాలని కోరారు. సీఐటీయూ నాయకులు తోట శ్రీను, పురపాలక కార్మికులున్నారు.

జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు

మరిపెడ, న్యూస్‌టుడే: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రావణ్‌కుమార్, సహాయ కార్యదర్శి వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పలు ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, ఫిట్‌నెస్ లేని వాహనాలతో విద్యార్థులను తరలిస్తూ చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినట్లు వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కుమురం భీం ఆశయ సాధనకు కృషి



మహబూబాబాద్‌లో

మహబూబాబాద్ టౌన్, మానుకోట, గార్ల, నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: కుమురం భీం ఆశయ సాధనకు యువత కృషి చేయాలని నేతాజీ సేవా సమితి అధ్యక్షుడు కందుల నాగరాజు కోరారు. కుమురం భీం జయంతి సందర్భంగా నేతాజీ సేవాసమితి బాధ్యుల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో భీం జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కుమురం భీం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. సేవా సమితి ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి కుదురుపాక వివేక్, ఉప కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మైస రోహిత్, కన్వీనర్ బోనగిరి లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ వోబిలిశెట్టి రామకృష్ణ, సామ శ్రీనివాస్, శోభన్‌బాబు, నితిన్ తదితరులున్నారు. గార్లలో ఏటీఎఫ్ రాష్ట్ర బాధ్యులు రామచంద్రు భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు జబ్బా వీరస్వామి, మహిళా కార్యదర్శి శోభారాణి, కోశాధికారి ఎట్టి రాముదొర, తాటి రవి తదితరులున్నారు. మహబూబాబాద్‌లో భగత్ సింగ్ స్టడీ సర్కిల్ జిల్లా అధ్యక్షుడు కళ్లెం వీరారెడ్డి, కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు.



కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో



గార్లలో

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762,
మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499
డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్ నుంచి పశువైద్యశాల వైపు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పంది కొక్కు చనిపోయి దుర్వాసన వస్తుంది. ఇబ్బందిగా ఉంది. - **సునీల్**
సమాధానం: తగు చర్యలు చేపడతాం. - **భాగ్యలక్ష్మి, వార్డు కౌన్సిలర్, డోర్నకల్**

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ముత్యాలమ్మ ఆలయం నుంచి కంకరబోడ్ మండివెళ్లే సంఘంపాక్ ప్రధాన రహదారిలో వ్యర్థాల్ని పేరుకుపోయాయి. - **నాగరాజు**
సమాధానం: రహదారిని శుభ్రం చేయిస్తాం. - **తోట రాజేష్, శానిటరీఇన్‌స్పెక్టర్.**

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఆర్‌యూబీ అండర్ బ్రిడ్జిలో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తోంది. - **వెంకటరెడ్డి**
సమాధానం: శుభ్రం చేయిస్తాం. - **తోట రాజేష్, మున్సిపల్ శానిటరీఇన్‌స్పెక్టర్**

స్పందనకు వందనం

కాలువ శుభ్రం

డోర్నకల్, న్యూస్‌టుడే: తోడేళ్ల గూడెంలోని ఓ అంతర్గత వీధిలోని కాలువలో పేరుకుపోయిన మురుగును సిబ్బంది తొలగించారు. పరిసరాలను శుభ్రం చేశారు.

పిచ్చి మొక్కల తొలగింపు..

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కేంద్రీయ విద్యాలయం వెనుక వీధిలో దారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయని ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు 26వ వార్డు కౌన్సిలర్ డౌలాగర్ స్వాతి స్పందించారు. మున్సిపల్ సిబ్బందితో పిచ్చి మొక్కలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ మురళీధర్

తొర్రూరు, న్యూస్‌టుడే: ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.మురళీధర్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖాన వైద్యులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతా శిశు సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా సాధారణ ప్రసవాలను పెంచాలని, సిజేరియన్‌లను వీలైనంత తక్కువగా జరిగేలా చూడాలన్నారు. అలాగే వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన సేవలందించాలన్నారు. అనంతరం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ వారోత్సవ అవగాహన కరపత్రాలు, గోడప్రతులు ఆవిష్కరించారు. సమావేశంలో ప్రోగ్రాం అధికారులు సారంగం, నాగేశ్వరరావు, సుధీర్‌రెడ్డి, జిల్లా డిప్యూటీ మాస్‌మీడియా అధికారి ప్రసాదుతో పాటు రామకృష్ణ, శ్రీరామ్, రుక్మిద్దిన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు

తొర్రూరు డివిజన్

తొర్రూరు, న్యూస్‌టుడే: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డికి తొలి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన శ్రీపాల్‌రెడ్డిని గెలిపిస్తే సమస్యలపై పోరాడుతాడన్నారు. సంఘం ప్రతినిధులు విప్లవ్‌రెడ్డి, ముత్తిలింగం, శంకర్‌నాయక్, రంజాన్, రవీందర్‌తో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

పెద్దవంగర, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మండల బాధ్యుడు శివకుమార్ అన్నారు. మండలంలోని చిట్యాల ఉన్నత పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 5డీఏలు, పీఆర్సీ బిల్లులు, మెడికల్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు యాకయ్య, రమేష్, కోటేశ్వర్, సురేందర్, రాజేందర్ పాల్గొన్నారు.

అమ్మతో పాటు..



కుమారుడి ప్రవేశ పత్రాన్ని ప్రధానోపాధ్యాయురాలికి అందజేస్తున్న చామంతి

మానుకోట, న్యూస్‌టుడే: జిల్లాలో ఇప్పటికే దంతాలపల్లి మండలం పెద్ద ముప్పారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు తన కూతురును తమ బడిలో చేర్పించి ఆదర్శంగా నిలిచారు. అదే కోవలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈమధ్యనే డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయురాలిగా నియమితులైన ఆలకుంట్ల చామంతి తన కుమారుడు కౌశిక్‌ను ఒకటో తరగతిలో మంగళవారం చేర్పించారు. ఇప్పటివరకు కరీంనగర్‌లో నివాసం ఉన్న ఆమె అక్కడా తన కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు. ఇప్పుడు ఉద్యోగరీత్యా తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. ఆమెను ప్రధానోపాధ్యాయురాలు బీజే రాణితో పాటు సహ ఉపాధ్యాయులు అభినందించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి

కురవి, న్యూస్‌టుడే: మన ఊరు-మన బడి కార్యక్రమంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు-మన బడిలో భాగంగా చేపట్టిన పనులను మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించి నిరసన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన నిధులతో పనులు పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరిశీలించి పూర్తి చేయాలన్నారు. నాయకులు జ్యోతిబాస్, వీరేందర్, మహేశ్, విజయ్, ప్రమోద్ పాల్గొన్నారు.

తీవ్ర అస్వస్థతతో బాలింతరాలి మృతి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తీవ్రఅస్వస్థతకు గురై బాలింతరాలు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పట్టణంలోని గిరిప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన రాజేశ్వరీ పురిటి నొప్పులతో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. మంగళవారం ఆమె ఆడ శిశువుకు జన్మనిచ్చారు. శస్త్రచికిత్స అనంతరం ఆమె అస్వస్థతకు గురికాగా వెంటనే ఐసీయూకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. ఆసుపత్రి వైద్యులు మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆసుపత్రి వద్ద పోలీసులు ముందస్తు బందోబస్తు నిర్వహించారు.

విశ్రాంత ఈవోపీఆర్డీ మృతికి సంతాపం

గార్ల, న్యూస్‌టుడే: గార్లకు చెందిన విశ్రాంత ఈవోపీఆర్‌డీ బూడిద అరుణ్‌గౌడ్(58) అనారోగ్య కారణాలతో మంగళవారం ఖమ్మంలో మరణించారు. ఆయన మృతికి స్థానిక రాజకీయపార్టీలు, అన్ని వర్గాల ప్రజలు తమ సంతాపాన్ని తెలిపారు.

గ్రంథాలయం సందర్శన



అది అర శతాబ్దం చరిత్ర కలిగిన గ్రంథాలయం. లోపల ర్యాక్‌లలో అమర్చిన అకాడమిక్, పోటీ పరీక్షల పుస్తకాలున్నాయి. ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే తిరగేయాల్సిన పుస్తకాల్లో ఇవి కొన్ని. ఏ పుస్తకం ఎక్కడుందో తెలుసుకోవడం ఎలా.. మంగళవారం ఈ గ్రంథాలయం తనిఖీకి వచ్చిన జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఈ విషయమై గ్రంథపాలకుడిని ఆరా తీశారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడి అవసరాలు తెలుసుకున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ కావాలంటే గంటల తరబడి పలు పుస్తకాలు అధ్యయనం చేయాల్సి ఉంటుందని సూచించారు.

– న్యూస్‌టుడే, డోర్నకల్

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కురవి, న్యూస్‌టుడే: ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బలాస్టి రమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని మోద్గులగూడెం పాఠశాలలో సంఘం సమావేశం జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని అమలు చేయకపోవడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగాలు ఇచ్చి అండగా నిలవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను విడుదల చేయాలని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి శివకుమార్, శ్రీనివాస్, వెంకన్న పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



గార్లలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో విజయనిర్మల

గార్ల, న్యూస్‌టుడే: ఎరువులు, పురుగు మందుల విక్రయదారులు నిబంధనలను అతిక్రమిస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల హెచ్చరించారు. మండలంలోని గార్ల, పుల్లూరులోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను ఆమె విస్తృత తనిఖీలు చేశారు. రికార్డులు, సరకుల నిల్వ రిజిస్టరు, పుస్తకాలు, విక్రయదారుల అనుమతిపత్రాలను పరిశీలించారు. గడువు దాటిన ఎరువులు, పురుగు మందులు విక్రయించినట్లు ఫిర్యాదు వస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరికలు జారీ చేశారు. విక్రయదారులకు పలు సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి రామారావు వెంట ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే విమర్శలు అర్థరహితం

డోర్నకల్, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమ పనులపై మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ చేసిన విమర్శలు అర్థరహితంగా ఉన్నాయని కాంగ్రెస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ పేర్కొన్నారు. డోర్నకల్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. 30 ఏళ్ల అభివృద్ధిని పట్టించుకోని వ్యక్తి ఇప్పుడు నీతులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. అన్ని రంగాల్లో డోర్నకల్ పురపాలిక వెనకబాటుకు రెడ్యానాయక్ కారణమని తెలిపారు. రైతు సంక్షేమానికి, ఉద్యోగాల కల్పనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్న తీరుని చూసి ఓర్వలేక భారాస శ్రేణులు రోడ్డెక్కి తమ ఉనికిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు

ఓటరు నమోదు పత్రాల పంపిణీ

దంతాలపల్లి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరుగా ఉపాధ్యాయులు పేరు నమోదు చేసుకోవాలని భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న కోరారు. మండలంలోని పెద్దముప్పారం ప్రభుత్వ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను మంగళవారం కలిసి పేరు నమోదు చేసుకోవాలని దరఖాస్తు పత్రాలను పంపిణీ చేశారు.

స్వచ్ఛందంగా..!



నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని రావిరాల బస్టేజీ సమీపంలో ఉన్న కల్వర్టుపై గుంత ఏర్పడింది. రాకపోకల్లో వాహనదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'గుంతలమయం..ప్రమాదకరం' శీర్షికతో ఆదివారం చిత్రవార్తను 'ఈనాడు'లో ప్రచురితమైంది. గ్రామానికి చెందిన యువకుడు ఆకుల సురేష్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. జేసీబీతో గుంతను పూడ్పించి సమస్యను పరిష్కరించారు.

వసతి గృహాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

డోర్నకల్, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో (స్థానిక సంస్థల) అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మంగళవారం డోర్నకల్‌లోని మైనార్టీ పాఠశాల, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. తాగునీటి వసతి, వంట గదులు, మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పారిశుద్ధ్యం నిర్వహణ, వైద్య సదుపాయం తీరుతెన్నులపై ఆరా తీశారు. వసతి గృహాల్లో విరివిగా మొక్కలు నాటాలని ఆదేశించారు. అనంతరం శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. గ్రంథాలయంలో తాగునీటి వసతి, తదితర సదుపాయాలు మెరుగు పరుచాలని కోరారు. గ్రంథాలయ అవసరాల గురించి తనకు లిఖిత పూర్వకంగా నివేదిక పంపాలని ఈ సందర్భంగా అక్కడున్న పుర కమిషనర్ నరేష్‌రెడ్డిని ఆదేశించారు. ఎంపీడీవో డి.శ్రీనివాస్, తహసీల్దార్ వీరన్న, పుర కమిషనర్ నరేష్‌రెడ్డి, ఎస్టీ హాస్టల్ సంక్షేమాధికారి స్వామి, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపల్ రిజ్వాన ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని ఆలేరులో చోటు చేసుకుంది. ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. ఆలేరుకు చెందిన కోరే బీరయ్య, అతని కుమారుడు కోరే హరీష్ ఆలేరు బస్టేజీ నుంచి ద్విచక్ర వాహనంపై గ్రామానికి వస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో విధులు నిర్వహిస్తున్న బనవాసి జమదగ్ని వ్యాన్‌పై ఆలేరు గ్రామం నుంచి బస్టేజీ వైపు వస్తున్నారు. ఎదురుగా వస్తున్న స్కూటిని ఢీ కొట్టడంతో కోరే బీరయ్య, హరీష్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను మహబూబాబాద్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బీరయ్య కుమారుడు పెద్దకుమారుడు నవీన్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

అబ్బాయిపాలెంలో ముగ్గురికి..

మరిపెడ, న్యూస్‌టుడే: మండలంలోని అబ్బాయిపాలెం సమీపంలోని జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. 108 సిబ్బంది, పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం హుస్నాబాద్‌కు చెందిన చక్రాల నర్సయ్య, చక్రాల వెంకన్నలతో పాటు ఖమ్మం జిల్లా పాల్వంచ మండలం పుల్లయ్యగూడెంకు చెందిన నీరుడు శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ వద్ద ఉన్న రూ. 20 వేల నగదు, ఫోన్‌ను 108 సిబ్బంది యాఖూబ్ పటాన్, పైలెట్ ఉపేందర్ ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి సమక్షంలో పోలీసులకు అందజేశారు.

ఐదుగురి రిమాండ్

చిన్నగూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో దసరా సాయంత్రం సమయంలో రాళ్లు, కత్తితో దాడులు చేసుకోగా పలువురికి గాయాలయ్యాయి. పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్నారు. 15 మందిపై కేసు నమోదు కాగా మంగళవారం ఐదుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించిట్లు ఎస్సై ఝాన్సీ తెలిపారు.

వ్యాపారి ఆత్మహత్యాయత్నం!

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ బంగారం వ్యాపారి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బయ్యారం మండలం సంతులాల్‌బోడ్ తండాకు చెందిన మహేష్ మహబూబాబాద్‌లో బంగారు దుకాణం నిర్వహిస్తున్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులయ్యాయి. అవి తీరుతాయో లేదోనని మనోవేదనతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు సమాచారం. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

వరి యాజమాన్య పద్ధతులపై అవగాహన



రైతునేస్తం కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు

మానుకోట, న్యూస్‌టుడే: ప్రస్తుత వరి పంటలో అనుసరించిన ప్రధాన యాజమాన్య పద్ధతులపై హైదరాబాద్‌లోని వరి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దామోదర రాజు మంగళవారం ప్రసారమైన రైతు నేస్తంలో అవగాహన కల్పించారు. పత్తిలో అనుసరించాల్సిన పద్ధతులపై వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న, పత్తి సాగులో తన అనుభవాలను అభ్యుదయ రైతు బాల స్వామి రెడ్డి,. మార్కెటింగ్ విషయాలపై ఆయా శాఖల అధికారులు వివరించారు.

రైతులకు విత్తనాల పంపిణీ

దంతాలపల్లి, న్యూస్‌టుడే: రైతులు నూనె గింజల సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎన్ఎఫ్ఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్సల్టెంట్ సారంగం పేర్కొన్నారు. దంతాలపల్లి రైతుల వేదికలో జాతీయ ఆహార భద్రత పథకం కింద పలువురు రైతులకు మంగళవారం పొద్దు తిరుగుడు విత్తనాలను అందించారు. అనంతరం బొడ్లాడ, దాట్ల, కుమ్మరికుంట్లలో వేరుశనగ, వరి పంటలను పరిశీలించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పంట నష్టంపై సమగ్ర విచారణ చేపట్టాలి

నెల్లికుదురు, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడానికి అధికారులు నిర్వహించిన సర్వేలో అవకతవకలు చోటు చేసుకున్నాయని రాజులకొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రైతులు నర్సయ్య, ప్రతాప్, మధుకర్, మహేష్, ప్రవీణ్, సోమయ్య, సంతోష్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం మాట్లాడారు. వరదల కారణంగా చెరువు కట్ట ధ్వంసమైన పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదన్నారు. సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన వారికి పరిహారం అందజేయాలని కోరారు.

హామీలు అమలు చేయకుంటే ప్రజాఉద్యమాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రకటించిన హామీలను అమలు చేయకుంటే ప్రజాఉద్యమాలను నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని మల్లు స్వరాజ్యం నగర్ శాఖ, నున్న నారాయణనగర్ శాఖ, ప్రథమ మహాసభలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో ఆవుల రాజు, బానోతు సీతారాంనాయక్, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి, హేమానాయక్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

సంక్షిప్తంగా

కేసముద్రం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి కాలేరు యాదగిరి తెలిపారు. గాంధీ నగర్ శివారు వెంకట్రాంతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈవో తనిఖీ చేశారు. అక్కడ ఇద్దరు ఉపాధ్యాయినిలు పనిచేస్తుండగా ఒకరు సెలవులో వెళ్లారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు, ఆయా విధులకు హాజరు కాలేదు. వారు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తండావాసులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఎస్.ఆర్.శంకరన్‌కు నివాళి

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: సబ్ కలెక్టర్‌గా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ వృత్తిలో నిబంధత కలిగిన వ్యక్తి అని ఎస్.ఆర్. శంకరన్ అని గిరిజన సామాజిక చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గుగులోతు కిషన్ నాయక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్.ఆర్.శంకరన్ జయంతి నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు రామూర్తి, మామిడాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు. గూడూరు మండలంలోని మచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శంకరన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, సంఘం జాతీయ ఉపాధ్యక్షులు పార్నంది రామయ్య తదితరులున్నారు.

పీఆర్టీయూ ఉపాధ్యాయుల ప్రచారం

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డిని గెలిపించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ కోరారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాల. సాంఘిక సంక్షేమ గురుకులం, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో ఓటరు నమోదు పత్రాలను అందజేశారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలుడి మృతి

కేసముద్రం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాలుడు మృతి చెందిన సంఘటన మంగళవారం సబ్‌స్టేషన్ తండాలో చోటు చేసుకుంది. హరీశ్, కస్తూరి దంపతులకు కుమారుడు జయంత్(2) కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మూడు రోజులుగా జ్వరం రావడంతో పరిస్థితి విషమించి మృతి చెందాడు. బాలుడి మృతితో ఆ కుటుంబం కన్నీరు మున్నీరుగా విలపిస్తుంది.

గోడపత్రికల ఆవిష్కరణ

గార్ల, న్యూస్‌టుడే: ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా వర్సిటీలో పీడీఎస్‌యూ 50వ అర్ధశతాబ్ద వారోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం మండల కార్యదర్శి మహేశ్‌కుమార్ కోరారు. ఈమేరకు గోడపత్రికలను ఆవిష్కరించారు. నరేష్, సతీష్, వాసు తదితరులున్నారు.

స్వామివారికి శ్రీ చక్రస్నానం



స్వామివారికి చేస్తున్న గజ వాహనసేవ

గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దోపోత్సవం, శ్రీ చక్రస్నానం నిర్వహించారు. దోపోత్సవంలో గజ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రదర్శించారు.

కెపాసిటర్ల ఏర్పాటుతో విద్యుత్తు ఆదా



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఈఈ

కేసముద్రం, న్యూస్‌టుడే: వ్యవసాయ బావుల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వల్ల విద్యుత్తును ఆదా చేయవచ్చని డీఈఈ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని అర్పణపల్లి గ్రామంలోని వ్యవసాయ బావులకు అమర్చిన విద్యుత్తు మోటార్లను డీఈఈ విజయ్‌కుమార్ మంగళవారం రైతులతో కలిసి సందర్శించారు. కెపాసిటర్లు అమర్చడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రయోగాత్మకంగా వివరించారు ఈ కార్యక్రమంలో ఏడీఈ ఐలయ్య, ఏఈ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోల నిరసన



నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: వ్యవసాయ విస్తరణ అధికారులను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మహబూబాబాద్ మండలంలోని రైతు వేదిక వద్ద ఏఈవోలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముందస్తుగా నోటీసులు ఇవ్వకుండా నేరుగా సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఈవోల సంఘం జేఏసీ అధ్యక్షులు రాజు, కార్యదర్శి మంగ శ్రీనివాస్, సాయి ప్రకాష్, సాయిచరణ్, వినోద్ తదితరులున్నారు.

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణకు వినతి

తొర్రూరు, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగుసేవల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని పుర కమిషనర్ శాంతికుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము దేవేందర్, సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్‌లు సంయుక్తంగా మాట్లాడారు. తమ డిమాండ్ల పరిష్కారానికి ఈనెల 25న హైదరాబాద్‌లో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య, యాకన్న, వెంకట్రామనర్సయ్య, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.